క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి



సచివాలయ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం, పెద్దతుంబళం, బల్లేకల్, గణేకల్ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు, గ్రామస్తులు సచివాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.వెంకటేశులు, ఆదోని మండల కార్యదర్శివర్గ సభ్యులు బి.వీరారెడ్డి, డి.రామాంజనేయులు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీసీ రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు హనుమంతరెడ్డి, లక్ష్మన్న, నాయకులు ముత్తన్న, విరుపాక్షి, అబ్బాస్ పాల్గొన్నారు.

డిగ్రీ దరఖాస్తులకు గడువు పొడిగింపు

ఆదోని సెంట్రల్: డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం మరోసారి గడువు పొడిగించిందని స్థానిక డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మహబూబ్ బాషా శుక్రవారం తెలిపారు. ఓఏఎండీసీ వెబ్‌సైట్‌లో ఈనెల 17వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశమిచ్చిందన్నారు. 15వ తేదీ నుంచి జరగాల్సిన వెబ్ ఆప్షన్స్ 20వ తేదీకి మార్చినట్లు తెలిపారు.

ఫీజు దోపిడీ అరికట్టాలి

పెద్దకడబూరు: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు దోపిడీని అరికట్టాలని ఏఐఎస్‌ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు వీరేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న ప్రైవేట్ పాఠశాలలు ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి వరకు వేలకు వేలు ఫీజు వసూలు చేస్తున్నా ఎంఈఓ పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా అధికారులు స్పందించి ఎంఈఓపైనా, ప్రైవేట్ పాఠశాలలపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు రవి,శివ, ప్రభాకర్ పాల్గొన్నారు.


ఈరన్న స్వామికి విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద ఈరన్న స్వామికి కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన జగదీష్‌కుమార్ శెట్టి కుటుంబ సభ్యులు శుక్రవారం రూ.50,000 విరాళం ఇచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. దాత కుటుంబానికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసినట్లు వారు తెలిపారు.


కార్డెన్ సెర్చ్



నాటుసారా స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

ఆదోని అర్బన్: పట్టణంలోని వాల్మీకినగర్, భావాజీపేట, గుండ్లగేరిలలో శుక్రవారం డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. 20 లీటర్ల నాటుసారా, రికార్డులు సరిగా లేని 16 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

దుస్తుల పంపిణీ



పారిశుధ్య సిబ్బందికి దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని బదినేహాల్ గ్రామ పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం నుంచి మంజూరైన దుస్తులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుబ్బారాజు మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రసన్నగౌడ్, కార్యదర్శి వహీద్, గ్రామ సీనియర్ నాయకుడు లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

కర్ణాటక వాసి మృతి



రాఘవేంద్ర మృతదేహం

మంత్రాలయం రూరల్: కర్ణాటక రాష్ట్రం బెంగళూరు పట్టణానికి చెందిన డీఎల్ రాఘవేంద్ర(40) మంత్రాలయం తుంగభద్ర నది ఒడ్డున శుక్రవారం మృతిచెందినట్లు ఎస్ఐ వేణుగోపాల్‌రాజు తెలిపారు. మతిస్థిమితం కోల్పోయి మూడు రోజులుగా మంత్రాలయంలో ఉంటున్నట్లు తెలిపారు. కాగా మూర్ఛ వచ్చి మరణించినట్లు స్థానికులు తెలిపారు. విషయాన్ని కుటుంబ సభ్యులకు చేరవేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆట పాటలతో చదువు

- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహ్లాదకర వాతావరణం
- ఆట బొమ్మలను చూపిస్తూ ఆకట్టుకునే బోధన



బొమ్మలతో విద్యను అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్

ఆదోని సెంట్రల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆట పాటలతో అర్థమయ్యేవిదంగా విద్యబోధన అందిస్తారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ చదువులను చదివించాలనే పేద మధ్య తరగతి వారికి ఈ కేంద్రాలు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా వారిని నిరుత్సాహ పరచకూడదని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీప్రైమరీ పాఠశాలలుగా ఏర్పాటు చేసి వారికి విద్యబోధనను అందిస్తోంది.

– ఆదోని పట్టణంలో 126 గ్రామీణ ప్రాంతాల్లో 98 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. పట్టణంలో 11,840 మంది పిల్లలు, గ్రామీణ ప్రాంతంలో 11,937 మంది పిల్లలు ఆయా కేంద్రాల్లో ఉన్నారు. పిల్లలకు కథలు చెప్పడం, సృజనాత్మకతను వెలికి తీయడం, బొమ్మలను ఇచ్చి హావభావాలతో చిన్నచిన్న పాటలను పాడించడంతో పాటు పౌష్టికాహారం అందిస్తుండటతో చిన్నారులు కూడా ఉత్సాహంగా అంగన్‌వాడీలకు వస్తున్నారు.

ప్రీప్రైమరీ విద్య..

అంగన్‌వాడీ కార్యకర్తలు మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు అవగాహనతో కూడిన విద్యను అందిస్తున్నారు. సంపూర్ణ అభివృద్ధి, మేధస్సు పెంపొందించి బడికి సంసిద్ధులను చేస్తున్నారు. దీంతో పిల్లలు శారీరకంగా, మానసికంగానూ ఎంతో అభివృద్ధి చెందుతున్నారు. అందుకే ప్రభుత్వం పీపీ-1, పీపీ-2 తరగతుల పాఠ్యప్రణాళికలను రూపొందించింది. పిల్లలు త్వరగా నేర్చుకునే వయస్సు కాబట్టి వారికి అంగన్‌వాడీ టీచర్లు వివిధ పదాలను ఎలా ఉచ్చరించాలో నేర్పిస్తున్నారు. బొమ్మలను చూపించి ఇంగ్లీషు పదాలను కూడా పలికిస్తున్నారు.

పీపీ కిట్లతో..

ప్రీప్రైమరీని రెండు భాగాలుగా విభజించారు. ప్రీప్రైమరీ-1లో 4 ఏళ్లలోపు పిల్లలు ఉంటారు. ప్రీప్రైమరీ-2లో 4 ఏళ్ల పైబడిన పిల్లలుంటారు. వీరికి బొమ్మలు, అక్షరాలు, స్పోకెన్ ఇంగ్లీషు పదాలు, కథలు, బొమ్మలు ఉన్న పుస్తకాలను అందిస్తారు. వీటితో పాటు కలర్ పెన్సిల్స్, పలక ఇస్తారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి టీచర్ తమకు కేటాయించిన సిలబస్ ప్రకారం పిల్లలకు విద్య అందించాలి. విద్యాసంవత్సరం మూడు విభాగాలుగా చేసి ఆయా మాసాల్లో పిల్లలకు ఏమేమి నేర్పించాలో వాటి ప్రకారం విద్యను అందిస్తారు.



పుస్తకాల్లో బొమ్మలను చూపి అక్షరాలను పలికిస్తున్న అంగన్‌వాడీ టీచర్

బడికి సంసిద్ధులను చేస్తాం



పిల్లలు కాస్త పెద్దయ్యాక బడికి పోవాలంటే మారాం చేస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించడం వల్ల వాళ్లలో ఉన్న భయం పోతుంది. ఆట పాటలతో పిల్లలకు విద్యను అందిస్తాం. ప్రైవేట్ పాఠశాలల్లో మాదిరిగా ఇంగ్లీషు పదాలు, అంకెలు, కథలు నేర్పించి పాఠశాలకు వెళ్లేందుకు సంసిద్ధులను చేస్తాం.

– తిక్కమ్మ అంగన్‌వాడీ టీచర్

ఎంతగానో ఉపయోగం

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం పిల్లలకు ప్రీప్రైమరీ విద్యను అందించడం ద్వారా పేద మధ్య తరగతి వారికి ఎంతగానో ఉపయోగం. కేంద్రాల్లో ప్రతి విద్యార్థికి పీపీ-1, పీపీ-2 కిట్లను పంపిణీ చేస్తుంది. పలక, స్పోకెన్ ఇంగ్లీషు, బొమ్మలు, కథలు పుస్తకాలు, కలర్ పెన్సిల్‌తో కూడిన కిట్టును అందిస్తుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు కూడా పిల్లలు ఆకట్టుకునే విధంగా విద్యనందిస్తున్నారు.

– ఉమామహేశ్వరి ఇన్‌చార్జ్ పీడీ ఐసీడీఎస్

సబ్సిడీ టమాటా పంపిణీ





టమాటాలను పంపిణీ చేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అశోక్‌కుమార్, క్యూలైన్‌లో నిల్చొన్న మహిళలు, పురుషులు

ఆదోనిటౌన్: స్థానిక రైతు బజార్‌లో శుక్రవారం సబ్సిడీ టమాటాలను పంపిణీ చేశారు. మార్కెట్‌లో కిలో టమాట రూ.100 పైగా ధర పలుకుతుండటంతో ప్రభుత్వం వినియోగదారులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి కిలో రూ.50 లకే అందజేసింది. వారంలో రెండు రోజులు సబ్సిడీ టమాట విక్రయించనున్నట్లు తెలిపారు. మార్కెట్ యార్డు చైర్మన్ మజార్‌అహ్మద్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అశోక్‌కుమార్ తెలిపారు. ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ సమర్పించి కిటో టమాటాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దస్తగిరి స్వామి దర్గాకు విరాళం



నగదు అందజేస్తున్న మురళీమోహన్‌రెడ్డి

కోసిగి: కాశమ్మ గడ్డ కాలనీలో వెలసిన దస్తగిరి స్వామి దర్గా పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఎమ్మెల్యే తరుపున వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి శుక్రవారం దర్గా నిర్వాహకులకు విరాళం నగదు అందించారు.

స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

కోసిగి: సెబ్ సర్కిల్ కార్యాలయం నిర్మాణానికి పాత మండల పరిషత్ కార్యాలయం ముందు భాగంలో 20 సెంట్ల స్థలం కేటాయించారు. శుక్రవారం ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆ స్థలాన్ని తహసీల్దార్ రుద్రగౌడ, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, సర్వేయర్ బసవరాజుతో కలిసి పరిశీలించారు. సచివాలయం-5 కార్యాలయం తనిఖీ చేశారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని నిరుపయోగంగా వదిలి వేయకుండా ఉపయోగించుకోవాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు.

ఉచిత వైద్య శిబిరం



మాట్లాడుతున్న వై.సీతారామిరెడ్డి

మంత్రాలయం రూరల్: మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో కర్నూలు అమిలీయో, గ్రీటింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. అమీలియో ఆస్పత్రి డాక్టర్లు యశోద, రఘు, మురళి.. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు వై.సీతారామిరెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎస్ఐ కిరణ్‌బాబు, గ్రీటింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ నిర్వాహకుడు ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఆదోని అర్బన్: పాత బస్టాండు ప్రాంగణంలోని షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి మార్చిలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో టెండర్ పిలిచిన ఆదోని పురపాలక సంఘం అధికారులపై చర్యలు చేపట్టాలని బీజేపీ జిల్లా కార్యదర్శి నాగరాజుగౌడ్, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు మలేకర్ శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మహాదేవ్, ప్రధాన కార్యదర్శి ఉరుకుందుగౌడ్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ ఆచారి, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

మంత్రాలయం రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎస్ఐ వేణుగోపాల్‌రాజు అన్నారు. కల్లుదేవకుంట గ్రామంలో శుక్రవారం పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. కాసేపు ప్రజలతో సమావేమయ్యారు. బాల్య వివాహాలు చేయడం ద్వారా పిల్ల భవిష్యత్తు నాశనమవుతుందన్నారు.

నీళ్లు, నిధుల కేటాయింపులో సీమకు అన్యాయం

మంత్రాలయం రూరల్: నీళ్లు, నిధుల కేటాయింపులో రాయలసీమకు తీరని అన్యాయం జరగుతోందని, దీనిపై ఈనెల 28న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్‌పీఎఫ్, రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆదోని డివిజన్ అధ్యక్షుడు మోహన్ కోరారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆవిష్కరించారు.

సమస్యలు తెలుసుకునేందుకే గడప గడపకు



పథకాలను ప్రజలకు తెలియజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్: ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను తెలుసుకునేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిన్నగొనేహాల్ గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి తిరిగి ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మురుగు కాలువలు, మరుగుదొడ్ల సమస్యలు ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు దేవా, ఎంపీడీఓ గీతావాణి, సర్పంచ్ రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ వీరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం



ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

- మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

కౌతాళం: వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని బదినేహాల్ గ్రామంలో రూ.1.62 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, కౌతాళం సింగల్ విండో అధ్యక్షుడు దాట్ల కృష్ణంరాజు, గ్రామ నాయకుడు లక్ష్మిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరడంతో నూతన భవనం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపి నిధులు మంజూరు చేయించి భవనం నిర్మించినట్లు తెలిపారు. కల్లుదేవకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.70 లక్షలు, కోసిగికి రూ.24 లక్షలు, పెద్దకడబూరుకు రూ.52 లక్షలు, పెద్దకడుబూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మరో రూ.55 లక్షలను మంజూరు చేయించి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. మంత్రాలయం మండలం కాచపురం, కోసిగి మండలం కందుకూరు, పెద్దకడబూరు మండలం మురవణిలో ఆరోగ్య కేంద్రాల ఏర్పాటకు రూ.2 కోట్ల చొప్పున నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను పట్టించుకోవాల్సిన పని లేదని, నియోజకవర్గ ప్రజల దీవెనలతో నాలుగో సారి కూడా ఎమ్మెల్యేగా తానే గెలుపొంది మరింత అభివృద్ధి చేస్తానని దీమా వ్యక్తం చేశారు. జనసేవ అధినేత పవన్‌కళ్యాణ్ వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలు అతని అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు. టీడీపీ నేత లోకేష్ యువగళం పేరుతో అడుగు పెట్టడంతోనే వచ్చే వర్షాలు కూడా రాకుండా పోయాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరేష్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కోఆప్షన్ మెంబర్ మహబూబ్‌సాబ్, గ్రామ ఉప సర్పంచ్ ప్రసన్నగౌడ్, మండల కన్వీనర్ ప్రహ్లాదచారి, ఏకాంబర్‌రెడ్డి, వల్లూరు మరేగౌడ్, హాల్వి చెన్నప్పధని, కౌతాళం సింగల్ విండో మాజీ అధ్యక్షుడు వీరసేనరెడ్డి, మాజీ ఎంపీపీ లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన సాక్షరభారత్ కోఆర్డినేటర్లు



వీరేష్‌కు జాయినింగ్ ఆర్డర్ ఇస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కోసిగి: స్వచ్ఛ భారత్ మిషన్ ఫేస్ -2 మండల కోఆర్డినేటర్ ఐరన్ గల్లు వీరేష్ విధుల్లో చేరినట్లు ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం వీరేష్‌కు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి జాయినింగ్ ఆర్డర్ అందజేశారు. దీంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి వీరేష్ కృతజ్ఞతలు తెలిపారు.

- మంత్రాలయం రూరల్: స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్‌గా షఫీఉల్లా శుక్రవారం విధుల్లో చేరారు. జాయినింగ్ లెటర్‌ను ఎంపీడీఓ మణిమంజరీ అందజేశారు.

వివాహిత ఆత్మహత్య

ఆదోని అర్బన్: స్థానిక అమరావతి కాలనీలో నివాసం ఉంటున్న వివాహిత అయ్యమ్మ(21) శుక్రవారం ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వన్‌టౌన్ సీఐ విక్రమసింహ తెలిపిన వివరాలు.. భర్త సుధాకర్, అత్త కలిసి తెర్నెకల్ గ్రామంలో పెళ్లికి వెళ్లారు. మామ ఉదయం పనినిమిత్తం బయటకు వెళ్లాడు. సాయంత్రం వచ్చి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని అయ్యమ్మను ఉరి నుంచి కిందకు దించారు. కాగా ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలు నుంచి జారి పడి యువకుడి మృతి

వెల్దుర్తి: రైలు నుంచి జారి పడి వెల్దుర్తి మండలం చెర్లకొత్తూరు గ్రామానికి చెందిన తోటశ్రీ మణికంఠ రాయల్(21) అనే యువకుడు మృతి చెందాడు. తమిళనాడు రైల్వే పోలీసులు వెల్దుర్తి పోలీసులకు అందించిన సమాచారం మేరకు.. ఈనెల 13న వేలూరు జిల్లా జోలార్‌పేట్ (సోలార్‌పేట్) పరిధిలో రైల్వే పట్టాలపై యువకుడి మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహం వద్ద లభించిన ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ద్వారా వెల్దుర్తి మండలం చెర్లకొత్తూరు గ్రామవాసి అని తెలుసుకుని వెల్దుర్తి పోలీసులకు సమాచారం అందించారు. మణికంఠ రాయల్ తండ్రి సతీష్‌బాబు నంద్యాలలో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తూ ఏడాది క్రితం మృతిచెందాడు. తల్లి జానకి అనంతపురం జిల్లాలోని గుంతకల్లు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి వద్దే ఉంటున్న మణికంఠ రాయల్..డిఫెన్స్ పరీక్షలు రాసేందుకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. సమాచారం అందుకున్న తల్లి జానకి ఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాన్ని గుర్తించి, అనంతరం అక్కడే ఎలక్ట్రికల్ బరియల్ గ్రౌండ్‌లో దహనక్రియలు పూర్తి చేశారు.

పురుగు మందు ప్రభావంతో రైతు మృతి

వెల్దుర్తి: పైరుకు పిచికారీ చేసి పురుగు మందు ప్రభావంతో రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చెర్లకొత్తూరులో చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. రైతు గోరంట్ల(53) గురువారం తన భార్య, పెద్ద కుమారుడు చంద్రశేఖర్‌తో కలిసి గ్రామ సమీపంలోని తన కౌలు పొలానికి వెళ్లాడు. పత్తి పైరుకు పురుగుల మందు పిచికారీ చేశాడు. సాయంత్రం ఇంటికి చేరుకుని తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆటోలో డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రైతు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. శుక్రవారం రైతు భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు కామన్‌దొడ్డిలో గడప గడపకు మన ప్రభుత్వం

కోసిగి: మండల పరిధిలోని కామన్‌దొడ్డి గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఇంటింటికి తిరిగి సమస్యలను తెలుసుకుంటారని, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

ప్రజా సంక్షేమమే సురక్ష ధ్యేయం



లబ్ధిదారులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న జేసీఎస్ కన్వీనర్ మురళీ మోహన్ రెడ్డి

కోసిగి: సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించాలనే ధ్యేయంతోనే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జేసీఎస్ మండల కన్వీనర్ మురళీ మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం కోసిగి సచివాలయం-5లో ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, కందుకూరు గ్రామంలో తహసీల్దార్ రుద్రగౌడ ఆధ్వర్యంలో జగన్న సురక్ష సదస్సు నిర్వహించి పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెట్టన గౌడ, ఎంపీపీ ఈరన్న, పార్టీ సీనియర్ నాయకుడు నాడుగేని నరసింహులు, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు మహాంతేష్ స్వామి, ఉరుకుంద ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యులు బుల్లి నరసింహులు, కన్వీనర్ అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

- మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని మాధవరం, మాధవరం తండా పంచాయతీల్లో శుక్రవారం తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ మణిమంజరీ తదితరులు జగనన్న సురక్ష సదస్సులు నిర్వహించి పలువురికి ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రామాంజనేయులు, సర్పంచులు ఇందిరమ్మ, లక్ష్మీబాయ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో పేదలకు మేలు



ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు

పెద్దకడబూరు: జగనన్న సురక్ష సదస్సుతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దారు వీరేంద్రగౌడ్ తెలిపారు. మండల పరిధిలోని జాలవాడీ గ్రామంలో సర్పంచ్ మల్లమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 245 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ ఉసేని, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయకుమారి పాల్గొన్నారు.

రేషన్ కార్డు మంజూరు చేశారు



కోసిగిలోని సిద్దప్ప పాలెంలో నివాసం ఉంటున్నాం. మూడేళ్లుగా రేషన్ కార్డు లేక ఇబ్బందులు పడ్డాం. జగనన్న సురక్ష సదస్సులో వలంటీర్ ద్వారా రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాం. రెండు రోజుల్లో మా కుటుంబానికి కొత్త రేషన్ కార్డు మంజూరు చేశారు. ఎలాంటి ఖర్చు లేకుండా ఉచితంగా కార్డు ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది.

– నాగేంద్ర, కోసిగి

కౌలు కార్డు వచ్చింది



పదేళ్లుగా రెండెకరాలు భూమిని కౌలుకు తీసుకుని సాగుచేసుకుంటున్నాను. గతంలో కౌలు కార్డు మంజూరు చేయలేదు. జగనన్న సురక్ష కార్యక్రమంలో కౌలు కార్డు కోసం దరఖాస్తు చేసుకోగా వెంటనే మంజూరు చేయించారు. కౌలు కార్డుతో ప్రభుత్వం అందించే నష్ట పరిహారం, రాయితీ విత్తనాలు, ఎరువులు, రుణాలు అందించేందుకు అవకాశం కల్పించడం సంతోషకరంగా ఉంది.

– క్రిష్ణ, దుద్ది